'నీట్' పై విచారణ జరిపించాలి

- దోషులు ఎంతటివారైనా వదలొద్దు
- ఎన్‌టిఎ చైర్మన్, డైరెక్టర్లను తప్పించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు డిమాండ్
- ఎస్‌వికె వద్ద భారీ ర్యాలీ, నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో నీట్ పరీక్ష గందరగోళం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం.. గ్రేస్ మార్కులను తొలగిస్తామని చెప్పడం కాదు.. పేపర్ లీకేజీపై విచారణ జరిపి దోషులు ఎంతటి వారైనా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.. అనంతరం నిరసన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. నీట్ గ్రేస్ మార్కులు రద్దు చేసి.. ఈ నెల 23న రీ-ఎగ్జామ్ నిర్వహించి, 30న ఫలితాలు ఇస్తామని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలపడం కాదని, అసలు పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజీపై కేంద్రం స్పందించకుండా.. ఎవరైతే గ్రేస్ మార్కులు పొందారో వారి స్కోర్ కార్డులు రద్దు చేసి, వారికి మళ్లీ రీ-ఎగ్జామ్ నిర్వహించడమంటే.. నీట్ అవకతవకలపై పక్కదారి పట్టించడమేనన్నారు. దీని వల్ల నీట్ ర్యాంకులు తారుమారై గందరగోళం ఏర్పడుతుందన్నారు. నీట్ పరీక్షపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయకుండా, ఎన్‌టిఎ ఏకపక్షంగా వ్యవరిస్తోందన్నారు. పరీక్ష కంటే ముందు రోజు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో 13మందిని పేపర్ లీకేజీలో అరెస్టు చేశారని గుర్తుచేశారు. హర్యానాలో ఒకే సీరియల్ నెంబర్ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయని, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో ఇలాంటి లీకేజీ అంశాలు ముందుకొచ్చాయని చెప్పారు. వాటిపై విచారణ జరపకుండా కేవలం గ్రేస్ మార్కులు మాత్రమే రద్దు చేసి రీ ఎగ్జామ్ పెట్టడమంటే నీట్ అవకతవకలను విస్మరించడం అవుతుందన్నారు.

రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ.. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మాత్రమే నీట్ ర్యాంకులు, పేపర్ లీకేజీ ఘటనలు జరుగుతున్నాయని, వాటిపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు నేతృత్వంలో విచారణ జరపాలన్నారు. మొత్తం రీ- ఎగ్జామ్ నిర్వహించి, ఎన్‌టిఎను రద్దు చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్‌టిఎ చైర్మన్, డైరెక్టర్లను తప్పించాలని, వారిపై సిబిఐ విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు దామెర కిరణ్, మమత, వీరభద్రం, కె.అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రశాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, లెనిన్ గువేరా, మందా శ్రీకాంత్, యార ప్రశాంత్, తారాసింగ్, జె రమేష్, విఘ్నేష్, వినోద్, ప్రశాంత్, అరవింద్, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పోకిరీలలకు షీ టీమ్స్ దడ

- వేధిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- రాచకొండ సిపి డా తరుణ్ జోషి
- 15 రోజుల్లో 147 మంది ఆకతాయిల ఆటకట్టు


ఆకతాయిలకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్, పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సిపి డా.తరుణ్ జోషి అన్నారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నాయని తెలిపారు. బాలికలను, మహిళలను వెంబడించే.. వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు చెప్పారు. కమిషనరేట్ పరిధిలో మహిళలను, యువతులను వేధింపులకు గురిచేసిన 147 (మేజర్స్-87, మైనర్స్-60) మందిని షీ టీమ్స్ పట్టుకున్నాయి. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో శుక్రవారం ఎల్‌బినగర్‌లో ఉన్న రాచకొండ కమిషనరేట్ క్యాంప్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గత నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 183 ఫిర్యాదులు అందాయని రాచకొండ విమెన్ సేఫ్టీవింగ్ డిసిపి టి ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టి దర్యాప్తు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. ఆడవారికి ఎదురయ్యే వేధింపుల నుంచి రక్షించేందుకు రాచకొండ షీ టీమ్స్ పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. పురుషులు మహిళల పట్ల బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి అండగా నిలవాలని సూచించారు. స్త్రీలను గౌరవించడం వ్యక్తిత్వంలో భాగం కావాలని, ఆడవారిని ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు వేధింపులకు గురైనప్పుటు వెంటనే షీ టీమ్స్ రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ఆయా ప్రాంత షీ టీమ్ అధికారుల నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. భువనగిరి ఏరియా - 8712662598, చౌటుప్పల్ ఏరియా-8712662599, ఇబ్రాహీంపట్నం ఏరియా - 8712662600, కుషాయిగూడ ఏరియా - 8712662601, ఎల్‌బినగర్ ఏరియా -8712662602, మల్కాజిగిరి ఏరియా - 8712662603, వనస్థలిపురం ఏరియా - 8712662604కు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సర్టిఫికెట్లతో మంత్రి పొన్నం ప్రభాకర్, రక్తదాతలు

వంద పడకల ఆస్పత్రుల్లో బ్లడ్ బ్యాంకులు

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి జిల్లా కేంద్రంతో పాటు వంద పడకలున్న ప్రతి ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్ సిఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సమీపంలో నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లడ్ బ్యాంకుల ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులను కోరారు. తాను కూడా ఈ విషయంపై సిఎం రేవంత్ రెడ్డితో పాటు, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. వీటి ఏర్పాటు కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులను వినియోగించుకోవాలని సూచించారు. అవి సరిపోకపోతే ప్రభుత్వం సహకరిస్తుందని భరోసానిచ్చారు. ఐఆర్ సీఎస్ కొనే వాహనాల రిజిస్ట్రేషన్‌పై పన్ను మినహాయింపునివ్వాలనీ, తలసేమియా రోగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఐఆర్ సీఎస్ చేసిన వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. వీటిని పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు మూఢ నమ్మకాలు తొలగించుకోవాలని కోరారు. రక్తదానంతో శరీరంలో రక్తం తగ్గదని స్పష్టం చేశారు. ప్రతి 120 రోజులకు ఒకసారి శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందని చెప్పారు. రాజ్ భవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రక్తదాతలు,, రక్తాన్ని స్వీకరించే వారంతా రక్తబంధువులేనని అభివర్ణించారు. వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా చొంగ్తూ మాట్లాడుతూ అన్ని దానాల్లో ప్రాణాన్ని నిలిపే రక్తదానం విశిష్టమైందని తెలిపారు. ఐఆర్ సీఎస్ ప్రధాన కార్యదర్శి కె.మదన్ మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐఆర్ సీఎస్ అందిస్తున్న సేవలను వివరించారు. అత్యధికసార్లు రక్తదానం చేసిన రక్తదాతలను, రక్తదాన ప్రచారకులను అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ తెలంగాణ బ్రాంచ్ చైర్మెన్ అజయ్ మిశ్రా, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి జె. భవానీశంకర్ పాల్గొన్నారు.

పర్యాటక, ఆతిథ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

- వెడ్డింగ్ డెస్టినేషన్‌కు రాష్ట్రం అనుకూలం
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పర్యాటక, ఆతిథ్య రంగాల్లో పెట్టు బడులు పెట్టాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పారిశ్రామికవేత్తలకు పిలుపు నిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాంతాలు, వారసత్వ కట్టడాలు, సహజ జల వనరులు, అడవులు, కొండలు, కోనలు, కోటలు, ప్రకృతి రమణీయతను ఆస్వాదించే ప్రాంతాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు మదుపర్లు ముందుకు రావాలని కోరారు. ఇండియాలోని బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ల జాబితాలో రాష్ట్రానికి చోటు లేకపోవడం దురదష్టకరమని అన్నారు. మ్యారేజ్ సీజన్లలో హైదరాబాద్, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లోని ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, కిక్కిరిసి పోతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర నలుమూలల ఉన్న పర్యాటక ప్రాంతాలను వెడ్డింగ్ డెస్టినేషన్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందులో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండ్రస్టీ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గోవాకు ఏ మాత్రం తీసిపోదని, సముద్రానికి బదులు శ్రీశైలం వయా సోమశిల, నాగర్జున సాగర్ వరకు ఉన్న 160 కిలోమీటర్ల మేర నల్లమల అడవుల గుండా ప్రవహిస్తున్న కృష్ణా నదీ తీరం, దట్టమైన అడువులు, వన్యప్రాణులు, జలపాతాలు అనేకమున్నాయని గుర్తు చేశారు, వీటిని వెడ్డింగ్ డెస్టినేషన్ కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని మూసీని లండన్‌లోని థేమ్స్ నదీ తీరం తరహాలో రూ. 70 వేల కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. అంతకుముందు వివిధ డిజైన్లతో రూపొందించిన ఫ్లోరల్ డెకరేషన్ స్టాళ్లను మంత్రి సందర్శించారు. భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కూచిపూడి, భారతనాట్యం, కథక్, మోహిని అట్టం, పేరిణి, ఫ్యూజన్ సాంప్రదాయాలు ఒక్క చోట మేళవించి రూపొందించిన వసుదైక కుటుంబం అనే నృత్య రూపకం అహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండి రమేష్, డైరెక్టర్ కె నిఖిల, టిసిఇఐ అధ్యక్షులు ఆళ్ల బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బురా తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ సర్కారు జిఓనే రేవంత్‌కు ఆయుధమా..?

- రైతు భరోసాపై కాంగ్రెస్ పక్కా వ్యూహం
- ఫామ్‌హౌస్‌లు, రియల్ ఎస్టేట్ స్థలాలు, వెంచర్లు మినహాయించే యోచన
- ఆ రూపంలో రూ.3 వేల కోట్ల వరకూ ఖజానాపై భారం తగ్గింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత బిఆర్ఎస్ సర్కారు ఇచ్చిన ఒక ప్రధానమైన ఉత్తర్వే... నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయుధం కాబోతోందా..? దాని ఆధారంగానే సిఎం రేవంత్ ఓ కీలక నిర్ణయానికి వడివడిగా అడుగులు వేయబోతున్నారా..? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రైతు భరోసా అత్యంత ప్రధానమైంది. కేసీఆర్ సర్కారు 'రైతు బంధు' పేరిట అమలు చేసిన ఆ పథకం పేరును కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు భరోసా'గా మార్చిన సంగతి తెలిసిందే. ఆ పథకం కింద కెసిఆర్ హయాంలో ఎకరానికి రూ.5 వేల చొప్పున రెండు పంటలకు కలిపి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అయితే తాము అధికారంలోకి వస్తే ఈ పెట్టుబడి సాయాన్ని రూ.7,500 (ఎకరాకు ఒక పంటకు)కు పెంచుతామంటూ రేవంత్ హామీనిచ్చారు. ఎన్నికల్లో ఈ హామీ కాంగ్రెస్‌కు పెద్ద ఎత్తున ఓట్లను రాల్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా అసెంబ్లీ సమావేశాలు, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కోడ్, అనంతరం ఎమ్మెల్సీ ఎలక్షన్ల కారణంగా రైతు భరోసాపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. కానీ ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాల్సి ఉంది కాబట్టి కీలకమైన ఆ పథకంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇందుకు సంబంధించి గత కెసిఆర్ సర్కారు రూపొందించిన విధి విధానాలు, అమలు చేసిన పద్ధతి, విడుదల చేసిన ఉత్తర్వులపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

బిఆర్ఎస్ రెండోసారి ముందస్తు ఎన్నికలకు వెళ్లటానికి కొద్ది నెలల ముందు రైతు బంధును ప్రవేశపెట్టింది. తొలుత ఎకరానికి ఒక పంటకు రూ.4 వేల మేర పెట్టుబడి సాయం చేస్తామనిప్రకటించింది. అందుకనుగుణంగా 04.04.2018 న కీలకమైన ఉత్తర్వు (జీవోనెం.231)ను విడుదల చేసింది. 'సాగు చేసిన భూమికే పెట్టుబడి సాయం...' అని ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. ఒకవేళ రైతు వానాకాలంతోపాటు యాసంగి పంట వేస్తే... ఆయన ఎంతమేర సాగు చేస్తే, అన్ని ఎకరాలకు ఈ పథకం వర్తిస్తుందంటూ సదరు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కానీ ఆ జీవోను కెసిఆర్ సర్కారే ఉల్లంఘించదనే విమర్శలు వెల్లువెత్తాయి. పంట వేయని బీడు భూములు, రియల్ ఎస్టేట్ కోసం పక్కకు పెట్టిన స్థలాలు, వెంచర్లు వేసి ఖాళీగా వదిలేసిన వాటితోపాటు ఇతరత్రా పడావుపడ్డ భూములకు కూడా రైతు బంధు పైసలు పడ్డాయి. తద్వారా పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగమవుతోందంటూ ప్రతిపక్షాలు ఆక్షేపించాయి. అయినా బిఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. ఇదే ఇప్పుడు రేవంత్ సర్కారుకు ఆయుధంగా మారబోతున్నది. కెసిఆర్ హయాంలో విడుదల చేసిన జీవోనెం.231ను పక్కాగా అమలు చేయటం ద్వారా అటు ఖజానాపై భారాన్ని తగ్గించటంతోపాటు ప్రధాన ప్రతిపక్షాన్ని కూడా రాజకీయంగా ఇరకాటంలో పడేయొచ్చని సిఎం రేవంత్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు కాంగ్రెస్ పక్కా వ్యూహాన్ని రచించనుందని తెలిసింది. మరోవైపు 'పంట వేయని భూములకు' రైతు బంధును నిలిపేస్తే సుమారు రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల వరకూ భారం తగ్గుతుందని ఆర్థిక శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు సిఎం రేవంత్‌కు, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు త్వరలోనే నివేదిక సమర్పించనున్నారు.

నాలుగు నెలల్లో 'ఉదయ సముద్రం' ప్రారంభం

- త్వరలోనే 13 వేల టీచర్ పోస్టుల భర్తీ
- ప్రభుత్వ బడులకు రూ.600 కోట్లు
- బ్రాహ్మణ వెల్లంలలో ఇందిరమ్మ ఇళ్లతో నూతన కాలనీ
- నార్కట్‌పల్లి బస్ డిపో పునరుద్ధరణ : మంత్రి కోమటిరెడ్డి

బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠ శాలు విద్యను అందించాలి. ప్రభుత్వ బడులకు 600 కోట్ల రూపాయలు కేటాయించాం.. త్వరలోనే 13వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తాం.. అలాగే, బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును నాలుగు నెలల్లో ప్రారంభిస్తాం.. అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలే పంపిణీ చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చదువుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు తప్ప నిసరిగా పిల్లలందరినీ బడికి పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయడం ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 600 కోట్ల రూపాయలు కేటాయించినట్టు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపట్టినట్టు తెలిపారు. అందులో భాగంగా జిల్లాకు రూ.50 కోట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. పాఠశాలల్లో పనులతో పాటు, విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టే బాధ్యత కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామన్నారు. త్వరలోనే 13 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. టాయిలెట్స్‌ను తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా బ్రాహ్మణ వెల్లెంలకు త్వరలోనే ఇండ్లు కట్టించి పేదల కోసం నూతన కాలనీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు రూ.70 కోట్లతో ప్రారంభం కానున్నాయని తెలిపారు. నాలుగు నెలల్లో బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ చేసినట్టు చెప్పారు. నార్కట్‌పల్లి బస్ డిపోను పునరుద్ధరించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని, త్వరలోనే కొత్తగా 20 బస్సులను డిపోకి అందిస్తామని తెలిపారు.

చదువుకుంటేనే కుటుంబాలు బాగుపడతాయని, మంత్రి కోమటిరెడ్డి ఆశయాల కనుగుణంగా పాఠశాలలను తీర్చిదిద్దుతామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బ్రాహ్మణ వెల్లెంల పాఠశాలను జిల్లాలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు దిగుతూ చక్రాల కింద పడి..

ఇంటర్ విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కదులుతున్న బస్సు నుంచి ఓ విద్యార్థిని కిందకు దిగుతూ చక్రాల కింద పడిపోయారు. దాంతో అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బోరబండ సంజయ్ నగర్‌కు చెందిన మెహరీన్ (17) యూసుఫ్‌గూడలోని మాస్టర్స్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. ఆమె అక్క కూడా అదే కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నారు.కాలేజీ అయిపోయిన అనంతరం యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ బస్టాప్‌లో కూకట్‌పల్లి డిపోకు చెందిన బస్సులో మెహరీన్ ఎక్కి ఫుట్ బోర్డుపై నిల్చున్నారు. అయితే బస్సులో ముందువైపు మహిళలతో నిండిపోవడంతో ఆమె అక్క ఎక్కలేదు. అది గమనించిన మెహరీన్ తాను కూడా దిగి ఇద్దరు కలిసి వేరే బస్సులో రావాలనే ప్రయత్నంలో కదులుతున్న బస్సునుంచి దిగేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఆమె జారి కింద పడిపోయారు. డ్రైవర్ గమనించకపోవడంతో బస్సు ముందు, వెనుక చక్రాలు కూడా ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే విద్యార్థిని మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

సామాన్యులకు అందుబాటులో 'ధరణి పోర్టల్'

- రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు చర్యలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధరణి పోర్టల్‌ను సామాన్యులకు అందుబాటులో తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ధరణి కమిటీ సభ్యులు ఎం కోదండరెడ్డి, ఎం సునిల్ కుమార్, మధుసూదన్‌లతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి అధ్యయనం చేయకుండా హడావిడిగా తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది భూ సమస్యలను ఎదుర్కొంటున్నారనీ, ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ధరణిలో పేరుకు పోయిన సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఈ కమిటీ రాష్ట్రంలో భూ సంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించడంతో పాటు 18 రాష్ట్రాల్లోని ఆర్ఒఆర్ యాక్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటు, భూ సంబంధిత ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించడం మొదలగు సిఫారసులను చేసిందని వెల్లడించారు. లోపభూయిష్టమైన 2020 ఆర్ఒఆర్ చట్టానికనుగునంగా రూపొందించిన ధరణి పోర్టల్‌ను బలోపేతం చేయడంతో పాటు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్పులు, చేర్పులు చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పార్ట్-బి లో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ధరణి కమిటీ చేసిన సిఫారసులపై సుధీర్ఘంగా చర్చించామని, తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించేకంటే ముందు అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

ఐసెట్‌లో 71,647 మంది ఉత్తీర్ణత

- 272 ఎంబిఎ కాలేజీల్లో 35,949 సీట్లు, 64 ఎంసిఎ కాలేజీల్లో 6,990 సీట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ రాతపరీక్షల ఫలితాలను శుక్రవారం హైదరాబాద్‌లో కాకతీయ విశ్వవిద్యాలయం (కెయు) విసి వాకాటి కరుణ, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. ఈనెల ఐదు, ఆరు తేదీల్లో ఆన్‌లైన్‌లో రాతపరీక్షలను నిర్వహించారు. ఐసెట్‌కు 86,156 మంది దరఖాస్తు చేయగా, 77,942 మంది పరీక్ష రాశారు. వారిలో 71,647 (91.92 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 41,190 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 36,806 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 33,928 (92.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 44,965 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 41,135 మంది పరీక్షలు రాశారు. వారిలో 37,718 (91.60 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఐసెట్ ఫలితాల్లో అబ్బాయిలే పైచేయి సాధించారు. అమ్మాయిల కన్నా అబ్బాయిలు 0.58 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఒక ట్రాన్స్‌జెండర్ పరీక్ష రాయగా, ఉత్తీర్ణత పొందారు. ఉత్తీర్ణులైన వారిలో 66,104 మంది స్థానికులు కాగా, 5,543 మంది స్థానికేతరులున్నారు. 153 మార్కులతో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ మునీబుల్లా హుస్సేని టాపర్‌గా నిలిచారు. 152 మార్కులతో రంగారెడ్డి జిల్లాకు చెందిన జెల్ల భరత్ రెండో ర్యాంకు, 150 మార్కులతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కందాల లాస్య మూడో ర్యాంకు, 148 మార్కులతో నిజామాబాద్ జిల్లాకు చెందిన పాలగుల్ల రిషికారెడ్డి నాలుగో ర్యాంకు, 143 మార్కులతో ఎపికి చెందిన కె శివకుమార్ ఐదో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ 272 ఎంబీఏ కాలేజీల్లో 35,949 సీట్లు, 64 ఎంసీఏ కాలేజీల్లో 6,990 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఐసెట్ కన్వీనర్ ఎస్ నర్సింహాచారి, మాజీ కన్వీనర్ పి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుమధుర స్వర కర్త సాయిబాబా

ప్రజాశక్తి - కల్చరల్

ఆకాశవాణిలో దశాబ్దాలపైగా పలువురు కవుల గీతాలను సంగీతాన్ని అందించిన సుమధుర స్వర కర్త సాయిబాబా అని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచార్య ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై బోయి భీమన్న సాహితీ నిధి నిర్వహణలో విజయ పల్లవి బోయి పేరిట ప్రఖ్యాత సంగీత దర్శకుడు పివి సాయి బాబాకు సంగీత పురస్కారం బహుకరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ వేణుగోపాలాచార్య పాల్గొని నగదు పురస్కారంతో సాయి బాబాను సత్కరించి మాట్లాడారు. విజయ పల్లవి ప్రభుత్వ ఉన్నతాధి కారిగా సితార్ నిపుణగా గాయనిగా పేరు సంపాదించుకొని కరోనా కాలంలో జీవితం చాలించిందని చెప్పారు. హైమవతి తన కుమార్తె మరణం జ్ఞాపకంగా ఉంచుకొని ఆమె పేరిట ప్రతి ఏటా వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాలు బహుకరిస్తున్నారనీ అభినందించారు. సాయి బాబా ఎందరినో ప్రోత్సహించి సంగీత కళాకారులును సమాజానికి అందించారని అన్నారు. అధ్యక్షత వహించిన రచయిత్రి డాక్టర్ శోభ పెరిందేవి మాట్లాడుతూ సాయిబాబా సంగీత సరస్వతి అన్నారు. సాహితీ వేత్త డాక్టర్ వి నిత్యానందరావు మాట్లాడుతూ బోయి భీమన్న కవిత్వంలో సాయి బాబా స్వర కల్పనలో ఘంటసాల గానంలో సౌందర్య ఆరాధన వుందని ప్రశాంత జీవనానికి ఇవీ సాధనాలు అన్నారు. పురస్కార ప్రదాత హైమవతి బోయి మాట్లాడుతూ విజయ పల్లవి పేరును నిలపటం కోసం పురస్కారాలు అందిస్తున్నానని భీమన్న గీతాలు సాయి బాబా స్వర కల్పన చేశారని చెప్పారు. వేదిక పై పోలీస్ విశ్రాంత అధికారి సుంకర సత్యనారాయణ నటి సుమిత్ర పంపన పాల్గొనగా సురేందర్ నిర్వహించారు. తొలుత యాదగిరి ఆచార్య శిష్య బృందం ప్రదర్శించిన నాట్యాలు ప్రేక్షకులను ముగ్ధులను చేశాయి.

కుసుమ ధర్మన్న కళా పఠాన్ని ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి కల్చరల్

వివక్షత ఎదుర్కొంటున్న దళితుల కోసమే కాక సమాజంలో ఉన్న పలు రుగ్మతలపై అవిశ్రాంతంగా పోరాడిన కుసుమ ధర్మన్న భవిష్యత్తు తరాలు గుర్తు ఉంచుకొనేలా రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలు అయన కళా పీఠ లు ఏర్పాటు చేయాలని ఇందుకోసం ప్రభుత్వాలకు వినతి చేశామని కుసుమ ధర్మాన్న మనుమరాలు కుసుమ రాధ చెప్పారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా దళిత ఉద్యమ కారులు కుసుమ ధర్మన్న యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. రాధ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను తెలుగు వారికి పరిచయం చేసిన ధర్మన్న గాంధీ అనుచరుడు ఐనప్పటికీ దళుతుల విషయంలో రాజీ పడలేదని చెప్పారు. తెలంగాణ ప్రాంతం భాగ్య రెడ్డి వర్మతో కలసి హైదరాబాద్ నగరంలో పలు ఉద్యమ సభలు జరిపారని గుర్తు చేసుకున్నారు. అయన రచించిన మా కొద్దీ నల్ల దొర తనం నాటి సమాజ పరిస్థితికి దర్పణం అన్నారు. కవులు రఘుశ్రీ, మిద్దె సురేష్ మాట్లాడుతూ అంటరాని తనం పోయినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం అని ధర్మన్న చెప్పేవారని అయన ఆశయం నేటికీ నెరవేరలేదని, నేటికీ వివక్షత దేశంలో కొన్ని ప్రాంతాలలో ఉందని అవేదన వెలిబుచ్చారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న రచనలు తక్కువ చేసినా సమాజాన్ని ప్రభావితం అయన జీవిత కథ సిలబస్‌లో ఉంచాలని కోరారు.

మాజీ మంత్రి మల్లారెడ్డిపై కేసు

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిపైనా..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై వారానికో కబ్జా కేసు నమోదవుతోంది. తాజాగా ఆయనపై, ఆయన అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపైనా భూ కబ్జా కేసులు నమోదయ్యాయి. తమ భూమి కబ్జా చేశారని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఫిర్యాదు మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. తమకు 32 గుంటల భూమి కబ్జా చేసి, అందులో కట్టడాలను కూల్చేశారని శేరి శ్రీనివాస్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు.. మల్లారెడ్డితో పాటు ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డిపైనా ఏడు సెక్షన్ల కింద కేసులు పెట్టారు.

శేరి శ్రీనివాస్ రెడ్డికి మేడ్చల్ జిల్లా సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82లో భూమి ఉంది. అయితే సర్వే నెంబర్ 82లో ఉన్న రెండున్నరెకరాల భూమి తమదేనంటూ మల్లారెడ్డి ఆరోపించారు. కానీ అందులో 1.11 ఎకరాలు తమదేనని, తలా 400 గజాలు కొన్నామని, కోర్టు తీర్పు తమకే అనుకూలంగా వచ్చిందని 15 మంది ఫెన్సింగ్ వేసుకున్నారు. అయితే, ఈ భూమి విషయంలో మల్లారెడ్డి, ఆయన అల్లుడు ఇటీవల ఆ స్థలంలో ఇతరులు వేసుకున్న ఫెన్సింగ్ తీసేసి హంగామా చేశారు. పోలీసులతోనూ వాగ్వాదానికి దిగారు. అనంతరం భూమిని అధికారులు సర్వే చేశారు. డాక్యుమెంట్ల ప్రకారం మల్లారెడ్డికి 29 గుంటల భూమి మాత్రమే ఉందని తేల్చారు. ఈ మేరకు అధికారులు జూన్ 13న హైకోర్టుకు నివేదిక కూడా అందించారు. అనంతరం సర్వే రిపోర్ట్‌ను కోర్టు ద్వారా సైబరాబాద్ పోలీసులకు అందజేశారు. దాంతో మల్లారెడ్డి, ఆయన అల్లుడిపై కేసు నమోదు చేశారు.

ధూమపానం, ఆల్కహాల్‌తో గుండెకు ప్రమాదం

- న్యూట్రిషన్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి

హైదరాబాద్ : ధూమపానం లేదా అధిక ఆల్కహాల్ వినియోగం వంటివి గుండెకు ప్రమాదాన్ని పెంచుతున్నాయని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి పేర్కొన్నారు. నేటి ప్రపంచంలో చాలా మంది తమ గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపే ఒత్తిడి జీవితాలను గడుపుతున్నారన్నారు. ఎదురవుతున్న ఒత్తిళ్ల, ఆందోళన వల్ల స్వీయసంరక్షణ కోసం సమయం కేటాయించలేక పోతున్నారన్నారు. మెరుగైన గుండె ఆరోగ్యం కోసం బాదములు, ఓట్స్, వెల్లుల్లి ఉత్పత్తులు తీసుకోవాలని సూచించారు. ఇవి రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతాయని పేర్కొన్నారు.

కెసిఆర్ అవినీతిపై ఇడి, సిబిఐ విచారణ జరిపించాలి

- గజ్జెల కాంతం, సతీష్ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు గజ్జెల కాంతం, సతీష్‌మాదిగ ఆరోపించారు. కెసిఆర్ అవినీతిపై రాష్ట్రానికి చెందిన విచారణ సంస్థలతో పాటు ఇడి, సిబిఐలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆయన్ను వెంటనే కెసిఆర్‌ను జైలుకు పంపాల్సిన అవసరముందన్నారు. కాళేశ్వరంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేయాలని కోరారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ముప్పై వేల ఎకరాల ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని తెలిపారు. ఇందులో కెసిఆర్, హరీశ్‌రావు, కెటిఆర్, కల్వకుంట్ల కవిత భాగస్వాములేనని వారు ఆరోపించారు. దేశంలో గోమాతకు ఉన్న రక్షణ, మాతృమూర్తులకు లేదన్నారు. బిజెపి పాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయనీ, చివరకు బేటీ బచావో అనే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి సీనియర్ నేత యడ్యూరప్ప 17 ఏళ్ల బాలికను లైంగిక వేధింపులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కూరలు.. పప్పులు కొనలేం

- వినియోగానికి సరిపడా లేని సాగు విస్తీర్ణం...
- పంట దిగుబడులొచ్చే వరకూ ధరల మంటలే
- ప్రతి ఏటా ఇదే తంతు.. పట్టించుకోని ప్రభుత్వాలు
- సబ్సిడీ ఎత్తివేతతో సాగుకు ఆసక్తి చూపని రైతులు
- ఇతర రాష్ట్రాల నుంచి అధిక దిగుమతులు
- మార్కెట్ సౌకర్యం కల్పించాలంటున్న అన్నదాతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఏం కొనేటట్లులేదు..ఏం తినేటట్లులేదు. నాగులో నాగన్న... ఈ ధరల మీద ధరలు పెరిగే నాగులో నాగన్న' అనే పాట పాతదే అయినా వర్తమానానికి వర్తిస్తుంది. సేరు పప్పుకొనబోతే సెటాకంత రాకపాయే... కిలో కాయలు కొందామంటే పావు కిలో రాకపాయే అన్నట్టు ఉంది మార్కెట్‌లో కాయగూరలు, పప్పు ధరల పరిస్థితి. మార్కెట్ మాయా జాలంతో పండించే రైతుకు గిట్టుబాటు ధర దక్కట్లేదు. వినియోగదారుల జేబుకు చిల్లులు పడుతున్నాయి. వినియోగానికి సరిపడ పంట రాష్ట్రంలో పండకపోవడం, ఏటా అకాల వర్షాల వల్ల పంట నష్టమేర్పడడంతో కాయకూరల ధరలు మండిపోతున్నాయి. దోసకాయ, దొండ, బెండ, వంకాయ, ఆలుగడ్డ ధరలు పైకి ఎగబకాయి. పచ్చిమిర్చి, క్యాప్సికం, బీర, కాకరకాయలైతే పావు కిలోకే సరిపెట్టేస్తున్నారు. కూరగాయలు, పప్పులే కాదు మాంసం, కోడిగుడ్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ఉల్లిని కొనలేని పరిస్థితి ఏర్పడింది. కాయకూరల సాగుకు సరైన ప్రోత్సహకాల్లేకపోవడం, సాగు చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు పంటలు పండుతాయి. దీంతో ఆగస్టు వరకు ఇతర రాష్ట్రాల మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పటిదాకా దళారులు కొరతను సృష్టించి ధరలు పెంచడం మామూలైంది. పంట చేతి కందేవరకు ధరలు అందుబాటులోకి రావడం కష్టమేనని తెలుస్తోంది. దీనకంతటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యమే. ప్రభుత్వాలు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే కాయగూరల సాగు పెరిగే అవకాశం ఉంది. స్కూల్స్ ప్రారంభమైనందున ప్రభుత్వ స్కూల్స్‌లో మధ్యాహ్నభోజనం, హాస్టల్స్, రెసిడెన్షియల్స్‌లో భోజనం, టిఫిన్స్ విషయంలోనూ కాయగూరలు, పప్పుల ధరల ప్రభావం పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ధరలు పరిస్థితి, కూరగాయల సాగుపై బుధ, గురువారాల్లో నవతెలంగాణ బృందం పరిశీలించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ప్రోత్సాహమేది...?

రాష్ట్రంలో 41.75 లక్షల టన్నుల కూరగాయలు అవసరం. ప్రస్తుతం 23.46 లక్షల టన్నుల కూరగాయలే మాత్రమే ఉన్నాయి. 18.29 లక్షల టన్నుల కూరగాయల కొరత ఉంది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనా. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో భూములకు రేట్లు పెరగడంతో ఎక్కువమంది కూరగాయల సాగుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో పాటు మార్కెటింగ్ సౌకర్యమూ ప్రభుత్వాలు కల్పించడం లేదు. 2020-21 నుండి రాష్ట్రంలో కూరగాయల సాగులో సబ్సిడీలను ఎత్తివేశారు. విత్తనాలు, డ్రిప్, మల్చింగ్ పేపర్, పందిళ్లు, ట్రెల్లిస్, ప్లాస్టిక్ క్రేట్స్ 50 శాతం సబ్సిడీ పై ఇచ్చేవారు. గత 4-5 ఏళ్లుగా ప్రభుత్వం ఉద్యాన శాఖ లో సబ్సిడీలను ఇవ్వడం లేదు. దీంతో రైతులు కూరగాయల పంటలు వేసేందుకు సుముఖత చూపడం లేదు. వ్యవసాయ ప్రణాళికలోనూ 70 లక్షల ఎకరాల్లో పత్తి, 60 లక్షల ఎకరాల్లో వరి సాగుకు ప్రభుత్వం అంచనా వేసింది. మిగతా 10 లక్షల ఎకరాల్లోనే కాయగూరలు, నూనెలు, పండ్లతోటలు, ఇతర పంటలు సాగు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వాల ప్రాధాన్యతల్లోనే ఈ పంటల సాగుకు సరైన ప్రోత్సాహం ఇవ్వడం లేదని తెలుస్తోంది.

ధరలు చుక్కల్లో ...

పంటలు లేకపోవడం, దళారుల మాయాజాలంతో మార్కెట్లో కాయగూరలు ధరలు చుక్కలనంటుతున్నాయి. ఆకు కూరలు, కాయగూరల ధరలు మండిపోతుండడంతో వినియోగదారులు విలవిలలాడుతున్నారు. మండుతున్న ధరల పరిస్థితిని పరిశీలిస్తే... సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో పచ్చిమిర్చి గాటు రకం కిలో రూ.100 ఉండగా సాధారణ రకం రూ.80 అమ్ముతుంది. అల్లంవెల్లుల్లి కిలో ధర రూ.200 పైనే ఉంది. కాకర, బీరకాయ కిలో ధర రూ.80, టమాటా, చామగడ్డ, క్యారెట్, దోస, వంకాయ కిలో ధర కూడా రూ.60 నుంచి రూ. 80 పలుకుతుంది. బెండ, దొండ, ఆలుగడ్డ సైతం రూ.50 నుంచి రూ.70 కిలో అమ్ముతున్నారు. పచ్చి మిర్చి కిలో రూ.120, వంకాయ కిలో రూ.100 అయింది. చిన్న సైజు నాలుగు మునగకాయల ధర రూ.50 ఉంది. గోరుచిక్కుడు, చిక్కుడు ధరలు కూడా మండుతున్నాయి. పాలకూర, గోంగూర, మెంతినకూర ధరలు కూడా పెరిగాయి.

పెరిగిన పప్పుల ధరలు

పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం పెరగకపోవడం, వర్షాల వల్ల పంట నష్టపోవడంతో వివిధ పప్పుల ధరలు కూడా పెరుగుతూ పోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన కంది పప్పు ధర కిలో రూ.185 ఉంది. సాధారణ రకమైతే రూ.175 పలుకుతుంది. పెసర పప్పు ధర కూడా రూ.125, శనపప్పు ధర రూ.92, మినపప్పు ధర రూ.140 వరకు ఉంది.

టిఎన్‌జిఒఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ముజీబ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ టిఎన్‌జిఒఎస్ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం హుస్సేని (ముజీబ్) ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లి గృహకల్పలోని సంఘం కార్యాలయంలో మారం జగదీశ్వర్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కేంద్ర కార్యవర్గ సభ్యులు హాజరై.. ముజీబ్‌ను ఏకగ్రీవంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పర్వతాలు, కార్యదర్శులుగా రాగి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ సింగ్, గూడ ప్రభాకర్, షఫీ అహ్మద్, కార్యవర్గ సభ్యురాలుగా గీతా రాణి ఎన్నికయ్యారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, ఎస్ఎం హుస్సేని ముజీబ్ మాట్లాడుతూ.. త్వరలో ఉద్యోగుల సమస్యల సాధనకు ముఖ్యమంత్రిని కలిసి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి.. ఒపిఎస్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు నెలకు రూ.500 చందాతో ఇహెచ్ఎస్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పిఆర్సీ కమిటీ ఆలస్యం చేయకుండా నిర్ణీత గడువులోపే తన నివేదికని ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు.

న్యూరోపతి నొప్పితో జీవన శైలిపై ప్రభావం

- డాక్టర్ శ్రీరామ్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

న్యూరోపతిక్ నొప్పి జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని డాక్టర్ శ్రీరామ్ అన్నారు. ఈ సమస్య శరీరం, మెదడు మధ్య సందేశాలను తీసుకెళ్లే నరాలలో సమస్యగా ప్రారంభమవుతుందన్నారు. ఈ నొప్పి కేంద్ర నాడీ వ్యవస్థ లోపాలు, మధుమేహం ఇతర పరిస్థితుల కారణంగా ఏర్పడుతుందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. వెన్నుముక, మెదడు భాగాలకు అనుసంధానమైన ప్రాంతంలో ఈ నొప్పి ఎక్కువగా కనిపిస్తుందన్నారు. ఈ నొప్పి చాలా తీవ్రంగా ఉంటుందని, పొడిచనట్లుగా, కాలినట్లుగా, కాల్చినట్లుగా ఉంటుందని అన్నారు. కొన్ని సార్లు కరెంటు షాక్ కొట్టినట్లు, సూదులతో గుచ్చినట్లు ఉంటుందన్నారు. జుట్టు దువ్వినా నొప్పి వస్తుందన్నారు. వీటికి తోడు కీమోథెరపీ మందులు, గాయం, శస్త్రచికిత్స, కణితుల సైతం నరాల నొప్పికి కారణమవుతాయన్నారు. తగిన విశ్రాంతి తీసుకోవడంతోపాటు వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలన్నారు. ఖచ్చితమైన చికిత్స కోసం వైద్యుడి సలహా ఎంతో మేలని సూచించారు.

జులై రెండో వారంలో రాష్ట్ర బడ్జెట్

- మార్చిలో ఓటాన్ అకౌంట్‌ను ప్రతిపాదించిన ప్రభుత్వం
- ఇప్పుడు పూర్తి స్థాయి పద్దుపై కసరత్తులు
- కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు
- 18 నుంచి శాఖల వారీగా మంత్రులతో డిప్యూటీ సిఎం భేటీలు
- అదే రోజు క్యాబినెట్‌లో రుణమాఫీతోపాటు బడ్జెట్‌పైనా చర్చ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణపై దృష్టి సారించింది. ఆ సమావేశాల్లోనే పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఎంపి ఎలక్షన్లు, సంబంధిత నోటిఫికేషన్, కోడ్ కారణంగా రేవంత్ సర్కారు గత మార్చిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదించిన సంగతి విదితమే. అయితే నిబంధనల ప్రకారం జులై చివరి నాటికి పూర్తి స్థాయి పద్దును అసెంబ్లీకి సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలను స్వీకరించాలంటూ డిప్యూటీ సిఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సిఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని శాఖలకు సమాచారం అందించారు. ఈ నెల 18 నుంచి డిప్యూటీ సిఎం... మంత్రులతో విడివిడిగా భేటీ అవుతారు. ఒక్కో రోజు ఒక్కో శాఖపై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహిస్తారు. మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, వాటిలో ఎంత మేర ఖర్చయింది..? కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు, సహాయాల పరిస్థితిపై ఆయన కూలంకుశంగా చర్చించనున్నారు. ఆ సందర్భంగా సంబంధిత మంత్రులతో సమాలోచనలు చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా కేంద్రమూ మార్చిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది. అందువల్ల ఇప్పుడు ఎన్‌డియే సర్కార్ కూడా పూర్తి స్థాయి పద్దును పార్లమెంటుకు సమర్పించాల్సి ఉంటుంది. ఆ పద్దులో రాష్ట్రానికి ఇచ్చే గ్రాంట్లు, ఇతర ఆర్థిక సహాయాలను పరిశీలించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ తన పద్దుకు తుది మెరుగులు దిద్దనుంది.

సిఎం రేవంత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలిచ్చిన సంగతి విదితమే. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మీ, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా కోసం గ్రామ సభల ద్వారా మొత్తం 1.28 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరిఫికేషన్ తర్వాత 1.09 కోట్ల అప్లికేషన్లు మిగిలినట్టు ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో అత్యంత కీలకమైన రైతు భరోసా కోసం రైతులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. రైతు భరోసాను అమలు చేయాలంటే బడ్జెట్‌లో సుమారు రూ.15 వేల కోట్లు (ఎకరానికి రూ.7,500 చొప్పున రెండు పంటలకు కలిపి రూ.15 వేలు) కేటాయించాలి. ఇందిరమ్మ ఇళ్లకు కూడా పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గత బీఆర్ఎస్ సర్కారు రూ.7 లక్షల కోట్ల మేర అప్పు చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని ప్రకటించింది. ఈ అప్పుకు నెలకు రూ.1,700 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకూ వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. వెరసి ఖజానాపై విపరీతమైన భారం పడుతోంది. ఇదిగాక ఆగస్టు 15 నాటికి రైతులకు రుణమాఫీ చేసి తీరాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. 'స్థానిక సంస్థల ఎన్నికల' నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని ఆపకూడదని ఆయన భావిస్తున్నారు. ఇందుకోసం రూ.35 వేల కోట్లు కావాలని అధికారులు సిఎంకు తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక పథకాలకు పూర్తి స్థాయి బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంటుంది. ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంపు, రైతు భరోసా తదితరాలను అమలు చేయటంలో జాప్యం చోటు చేసుకోవటంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఒకింత గుర్రుగా ఉన్నారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఎనిమిది సీట్లు గెలవటానికి ఈ అంశాలు కొంతలో కొంత ఉపయోగపడ్డాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వీలైనంత త్వరగా రైతు భరోసా, రైతు రుణ మాఫీ హామీలను అమలు చేయటం ద్వారా 'స్థానిక సమరం'లో మరింతగా సత్తా చాటాలని సిఎం రేవంత్... తన సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఈ నెల 18న నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పూర్తి స్థాయి బడ్జెట్‌తోపాటు రైతు రుణమాఫీపై చర్చించి పలు కీలక నిర్ణయాలను వెలువరించనున్నారని ఓ ఉన్నతాధికారి వివరించారు. బడ్జెట్ కసరత్తులు అనుకున్నంత వేగంగా పూర్తయితే జులై రెండో వారంలో, లేదంటే ఆ నెల మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు.

నకిలీ పత్రాల విషయంలో కార్పొరేటర్ అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ పత్రాలు సృష్టించి భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ మొక్క నరేందర్ కుమార్ అలియాస్ నందును పోలీసులు అరెస్టు చేశారు. మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం..

తాను రియల్ ఎస్టేట్ చేస్తానని.. అందులో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని కార్పొరేటర్ మొక్క నరేందర్(నందు) స్నేహితుడు చిత్తోజు కృష్ణకు చెప్పాడు. ఈ మేరకు కృష్ణ నుంచి నరేందర్ రూ. ఐదు కోట్లు తీసుకున్నాడు. కొంగరకలాన్‌లోని సర్వే నెంబర్ 76అ, 74ఆ, 75అ తదితర నెంబర్లలో దాదాపు ఆరు ఎకరాల 17 గుంటలు భూమిపై తప్పుడు అగ్రిమెంట్ పత్రాలు సృష్టించాడు. దాన్ని కృష్ణ, బొడ్డుపల్లి సతీష్ కుమార్, మొక్క నరేందర్ కుమార్ పేర్లపై అగ్రిమెంట్ చేసినట్టు చూపెట్టాడు. తర్వాత భూమి రిజిస్ట్రేషన్ చేయించాలని కృష్ణ పలుమార్లు కార్పొరేటర్‌ను అడిగాడు. అయితే కార్పొరేటర్ వాయిదాలు వేస్తూ రావడంతో అనుమానం వచ్చిన కృష్ణ భూమి యజమానులైన తుమ్మల ధీరజ్ రెడ్డి, తోట మాధవరెడ్డి, గుండు శ్రీకాంత్‌ను కలిశాడు. తమ భూమిని ఎవరికీ అమ్మలేదని వారు తెలిపారు. దాంతో మోసపోయినట్టు గ్రహించిన కృష్ణ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి కార్పొరేటర్ నరేందర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

చేసిన తప్పులకు కెసిఆర్ సమాధానం చెప్పాల్సిందే

- డాక్టర్ లింగం యాదవ్, ఇందిరా శోభన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పులకు, చేసిన పొరపాట్లకు మాజీ సిఎం కెసిఆర్ సమాధానం చెప్పాల్సిందేనని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ డిమాండ్ చేశారు. ఆయన పాలన భూకబ్జాలు, లిక్కర్, గొర్రెలు, చేపల వంటి కుంభకోణాలతో నిండిపోయిందని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. గొర్రెల కుంభకోణంలో మాజీ సిఎంకు ఇప్పటికే ఇడి నోటీసులు జారీ చేసిందన్నారు. తమ కుటుంబానికి ప్రయోజనం చేకూర్చేలా ఆయన వ్యవహరించారని విమర్శించారు. కెసిఆర్ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటికి తీస్తామంటూ కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పొందుపరిచిందని గుర్తు చేశారు. విద్యుత్ కొనుగోలుపై కమిషన్ ఏర్పాటు చేసి కెసిఆర్‌కు నోటీసులిచ్చినా ఆయన సమాధానం చెప్పుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత ఇందిరాశోభన్ మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ ఇళ్లు అందించిందని విమర్శించారు. 2,91,000 ఇండ్లు మంజూరైతే, బిఆర్ఎస్ ఇచ్చింది మాత్రం 46973 ఇళ్లు మాత్రమే ఇచ్చిందన్నారు. కెసిఆర్, మోడీ పేద ప్రజలను మోసం చేశారని ఆరోపించారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని పలువురు డాక్టర్లు సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిమ్స్ ఆస్పత్రి బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి బి శాంతి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ డాక్టర్లు డాక్టర్ మహేష్, డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యాగౌడ్ తదితరులతో కలిపి 150 మంది రక్తదానం చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 11 వేల మంది రక్తదానం చేసినట్టు శాంతి తెలిపారు. రక్తదాతలను ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీజీలు టెక్నికల్ స్టాఫ్ మల్లికార్జున్, బిడుగు శేఖర్ నర్సింగ్ స్టాఫ్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు, యూనియన్ నాయకులు

మే నెల పారితోషికాలు చెల్లించాలి

- ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మే నెల పారితోషికాలు తక్షణమే చెల్లించాలని ఆశా యూనియన్ (సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి జయలక్ష్మి, రాష్ట్ర నాయకులు ఎం మీనా, టి యాదమ్మ,రాణి, లత, రీటా, రఫత్ పర్వీన్ శుక్రవారం వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్వి కర్ణన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మే 29న 23 డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించామని, వాటన్నింటిని పరిష్కరించాలని కోరారు. అయితే పారితోషికాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయలేదనీ, బడ్జెట్ లేదని ప్రభుత్వం చెబుతున్నట్టు అధికారులు యూనియన్ నాయకులకు తెలిపారు. జూన్ నెల ప్రారంభమై 14 రోజులు గడుస్తున్నా గత నెల చేసిన పనికి పారితోషికాలు రాక ఆశాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని కమిషనర్‌కు తెలిపారు. వారి ఇబ్బందుల గురించి ప్రభుత్వంతో మాట్లాడి అకౌంట్లలో డబ్బులు వేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

బోల్తాపడిన ట్రాక్టర్

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన లారీ

- ఇద్దరు మృతి, ఐదుగురి పరిస్థితి విషమం
- అశ్వారావుపేట మండలంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట - ఖమ్మం రహదారిలోని నారమువారి గూడెం సమీపంలో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో గుమ్మడివల్లికి చెందిన 16 మంది కూలీలు ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం నుంచి మామిడి మొక్కలు లోడు చేసుకుని అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని ఓ ప్రయివేట్ నర్సరీకి తరలిస్తున్నారు. ఈ మొక్కలు లోడు, కూలీలతో నారంవారిగూడెం వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన ట్రాలీ లారీ అదుపుతప్పి ఢీ కొట్టి ఈడ్చుకు వెళ్లడంతో ట్రాక్టర్ బోల్తా పడి కూలీలందరూ చెల్లాచెదురయ్యారు. ఈ ప్రమాదంలో గుమ్మడవల్లికి చెందిన వెంకటలక్ష్మి (45) అక్కడికక్కడే మృతి చెందగా, బత్తుల దుర్గయ్య (60) అశ్వారావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్ర గాయాలయిన స్వాతి, అనిల్, ముసలియ్య, నీరజ, దుర్గమ్మను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. మిగతా వారికి స్థానికంగా చికిత్స అందిస్తున్నట్టు డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

ఇనార్బిట్ మాల్‌లో ఫాదర్స్‌డే ఆఫర్లు

హైదరాబాద్ : నగరంలోని ఇనార్బిట్ మాల్‌లో ఫాదర్స్ డే సందర్భంగా జూన్ 16వ తేదీ నుంచి ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అద్భుతమైన బహుమతులు, అందమైన జ్ఞాపకాలను పొందడానికి ఫోటోబూత్ ఉంటుందని పేర్కొన్నారు. సందర్శకులు మాల్‌లో ఉచిత వోచర్‌లు, ప్రత్యేకమైన ఆఫర్‌లను ఆస్వాదించవచ్చన్నారు. అదే విధంగా జులై చివరి వరకు ఎండ్ ఆఫ్ సీజన్ సేల్‌ను కూడా నిర్వహిస్తున్నామన్నారు.

మీడియా రంగంలో రామోజీరావు సేవలు మరువలేనివి

- ఆయన పేరిట అవార్డు నెలకొల్పాలి
- ప్రభుత్వానికి జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి

రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీడియారంగంలో అగ్రగామిగా నిలిచిన రామోజీరావు ఉన్నత విలువలతో కూడిన జర్నలిజాన్ని అందించిన అక్షర యోధుడని పలువురు సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాల నేతలు కొనియాడారు. వివిధ రంగాలతో పాటు మీడియా రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. రామోజీరావు మరణం మీడియా రంగానికి జర్నలిజానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయనకు పలువురు పాత్రికేయులు నివాళులర్పించారు. శుక్రవారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే), హైదరాబాద్ జర్నలిస్టుల యూనియన్(హెచ్ యూజే)ల ఆధ్వర్యంలో అక్షరయోధుడు, ఈనాడు మీడియా సంస్థల అధినేత దివంగత రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు. సీనియర్ పాత్రికేయుడు, హాస్య బ్రహ్మ శంకర్ నారాయణ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఐఎఫ్ డబ్ల్యుజె జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, హెచ్ యుజె అధ్యక్షులు టి అరుణ్‌కుమార్, కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొని రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి - శంకర్‌నారాయణ

రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని శంకర్‌నారాయణ అన్నారు. రామోజీ గొప్ప అక్షర శిల్పి అని చెప్పారు. తాను ఆచరిస్తూ..ఇతరలకు ఆదర్శంగా నిలిచారన్నారు. అందుకే ఆయన ఆచరణయోధుడని తెలిపారు. హాస్యమన్నా, సాహిత్యమన్నా రామోజీకి ఎనలేని ప్రేమని చెప్పారు. ఈనాడుతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మీడియారంగాన్ని విస్తరించి ఎంతో మంది జర్నలిస్టులను తయారు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం, ఎంచుకున్న ప్రతీ రంగం విజయవంతమై చాలా మందికి ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. తన మీడియా సంస్థల ద్వారా విలువలతో కూడిన జర్నలిజాన్ని అందించారని గుర్తు చేశారు. భవిష్యత్ తరాల పాత్రికేయులకూ ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య మాట్లాడుతూ అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను ఆయన గుర్తు చేశారు. ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా వారందించిన సేవలను జర్నలిస్టులుగా మరిచిపోలేనివని చెప్పారు. ఆయన మీడియాను విప్లవాత్మకంగా మార్చారన్నారు. మీడియా రంగంలో మహోన్నత వ్యక్తిగా ఎదిగిన రామోజీరావు పేరిట రాష్ట్ర ప్రభుత్వం అవార్డు నెలకొల్పి ప్రతి ఏడాది ఉత్తమ జర్నలిస్టుకు అవార్డు ఇవ్వాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్, కార్యదర్శులు ఈ. చంద్రశేఖర్, తన్నీరు శ్రీనివాస్, కోశాధికారి ఆర్ వెంకటేశ్వర్లు, నాయకులు రఘు, విజయానందరావు, నాగవాణి, యర్రమిల్లి రామారావు, అంజిరెడ్డి, గడ్డమీది అశోక్ తదితరులు పాల్గొన్నారు.